
ప్రజాశక్తి
ఆదివారం 1 డిసెంబర్ 2024



సెపక్ తక్రా పోటీల్లో
జిల్లాకు మూడో స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నంద్యాల జిల్లా నందికొట్నూరులో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో జిల్లా క్రీడాకారులు మూడో స్థానాన్ని కైవశం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గంట్యాడ కెజిబివి విద్యార్థులు కుమ్మరి అశ్విని, గండిబోని పవిత్ర జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. డిసెంబర్ 15 నుంచి కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు, సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎంటి రాజేష్, ట్రెజరర్ పి.భవాని, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్ రాజు, పీడీ సిహెచ్ సీత అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

రెవెన్యూ సమస్యలపై
ప్రత్యేక గ్రీవెన్స్

- బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు
- వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక
- జిల్లా సమీక్షా సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత
- పరిశ్రమలు ప్రారంభించకపోతే భూకేటాయింపు రద్దు : మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. రెవెన్యూ సమస్యలపై వినతుల స్వీకరణ కోసమే ఈ గ్రీవెన్స్ నిర్వహిస్తామని చెప్పారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి అనిత అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు.

మంత్రి అనిత మాట్లాడుతూ భూముల ఫ్రీహోల్డ్‌కు సంబంధించి సుమారు 490 ఎకరాల వరకు అవకతవకలు జరిగినట్లు తేలిందని, బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఎక్సైజ్ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, బెల్టుషాపులు ఎక్కడా లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. వచ్చే వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదని స్పష్టంచేశారు. దీనికోసం ఇప్పటినుంచే కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ధాన్యం తడిచి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీల భర్తీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని మంత్రి చెప్పారు. ఇళ్లపై ఉన్న, వేలాడుతున్న విద్యుత్తు తీగలను తొలగించేందుకు సమగ్ర సర్వే నిర్వహించి, నివేదికను తయారు చేయాలని ఆదేశించారు.

చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో నిర్ణీత గడువులోగా ఏర్పాటు చేయకపోతే, కేటాయింపులను రద్దు చేయాల్సి ఉంటుందని చెప్పారు. త్వరలో బొబ్బిలి గ్రోత్ సెంటర్‌ను సందర్శించి, కేటాయింపులపై సమీక్షిస్తామని చెప్పారు. జిల్లాలో చెరకు సాగు పెరిగిందని, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ శాఖలో ఎఇలు, లైన్‌మెన్ల ఖాళీల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. జిల్లాకు క్రీడా పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలో దీనిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాటిపూడి జలాశయానికి గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పునరుద్ధరించాలని కోరారు. అందుబాటులో చెరకు సేకరణ పాయింట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యుత్తు తీగలు కిందకి వేలాడటం, ఇళ్లపై ఉండటం వల్ల పలువురు ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారని, వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లాలో 11 మండలాల్లో సుమారు 41 కిలోమీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్లు కాలువల్లో ఉన్నాయని, వీటిని వారం పదిరోజుల్లో బయటకు తీసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేనివారికి ఉపాధిహామీ కింద మరుగుదొడ్లు నిర్మిస్తామని చెప్పారు.

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, ఎస్‌పి వకుల్ జిందాల్, జెసి ఎస్.సేతు మాధవన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ జిల్లాలో ఈగల్ బృందాలు

త్వరలో ప్రతీ జిల్లాలో ఈగల్ బృందాలను ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత తెలిపారు. కలెక్టరేట్‌లో ఆమె మీడియాంతో మాట్లాడుతూ గంజాయి సాగును, రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. దీనిలో భాగంగా ఈగల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈగల్ టాస్క్ ఫోర్స్ కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.9 కోట్లు ఖర్చుచేయనుందని చెప్పారు.

- ☞ ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ చెన్నై తరహాలో భోగాపురం ఎయిర్‌పోర్టుకు సముద్రపు నీటిని శుద్ధి చేసి వినియోగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.
- ☞ శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరును పునరుద్ధరించాలని అసెంబ్లీలో కూడా ప్రస్తావించామని తెలిపారు.
- ☞ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ల భారీ వాహనాల కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో రహదారులు పాడైపోయాయని చెప్పారు. జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీకి చేసిన భూసేకరణ, రైతుల సమస్యలను ప్రస్తావించారు.
- ☞ బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ పారాది వంతెన దెబ్బతినడం వల్ల ట్రాఫిక్‌ను మళ్లించడంతో నియోజకవర్గంలోని పలు రహదారులు దెబ్బతిన్నాయని చెప్పారు. వచ్చే వర్షాకాలంలోగానే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.
- ☞ నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను ప్రస్తావించారు.
- ☞ ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.



వారిద్దరు చిన్నప్పటి నుంచి ప్రాణ స్నేహితులు ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి తిరిగారు... పెరిగారు. కాని విధి వారిపట్ల చిన్నచూపు చూసింది. స్నేహితుడి కారులో విశాఖపట్నం బయలుదేరారు. విదేశాల నుంచి వస్తున్న బంధువులను తీసుకొచ్చేందుకు వెళున్నానని తోటి స్నేహితుడికి చెప్పగా, తన భార్యకు బ్యాంకు ఉద్యోగానికి సంబంధించిన పరీక్ష విశాఖలో ఉందని మరొకరు చెప్పడంతో అంతా బయలుదేరి వెళ్లారు. ఇంతలో పోలిపల్లి వద్ద అనుకోని ప్రమాదంలో డ్రైవరుతో సహా నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన వడ్డే అభినవ్ (27), ఆయన భార్య మణిమాల (24), గవిడి కౌశిక్ (27), డ్రైవర్ మోడి జయేష్ (20) అక్కడికక్కడే మృతి చెందారు.

ఘోరం

- ప్రాణం తీసిన అతివేగం
- టైరు పేలి పల్టీలు కొడుతూ లారీని ఢీకొన్న కారు
- నలుగురు దుర్మరణం
- మృతుల్లో దంపతులు
- అందులోనూ ఇద్దరు ప్రాణ స్నేహితులు



అభినవ్, మణిమాల దంపతులు (ఫైల్)



జయేష్



కౌశిక్

ప్రజాశక్తి-భోగాపురం

శ్రీకాకుళం పట్టణానికి చెందిన తూర్పుకాపు సంఘం నాయకులు లంకా బావాజినాయుడు కుమార్తె కుమారుడు వివాహం డిసెంబర్‌లో జరగనుంది. అందుకు అమెరికాలో ఉంటున్న బావాజినాయుడు కుమారుడు వస్తుండటంతో, వరుసకు మేల్లుడైన గవిడి కౌశిక్ విశాఖ విమానాశ్రయానికి బయలుదేరాడు. ఈ విషయాన్ని స్నేహితుడైన అభినవ్‌కు శుక్రవారం రాత్రి చెప్పాడు. తన భార్య మణిమాలకు విశాఖలో బ్యాంకు ఉద్యోగానికి సంబంధించిన పరీక్ష ఉందని అభినవ్ చెప్పడంతో కలిసి వెళ్దామని అనుకున్నారు. ముందురోజు అనుకున్నట్లే అంతా కలిసి కౌశిక్ కారులో బయలుదేరారు. ముందు సీట్లో కౌశిక్ కూర్చోగా, వెనుక సీట్లో అభినవ్ దంపతులు ఉన్నారు. అతివేగంగా వస్తున్న కారు పోలిపల్లి వద్దకు వచ్చేసరికి టైరు పేలిపోయింది. దీంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి అతి వేగంగా డివైడర్ పైనుంచి విశాఖ-శ్రీకాకుళం మార్గంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. దీంతో కారులో ఉన్న వారంతా అక్కడికక్కడే మృతి చెందారు. కారు నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ జయేష్ మృతదేహాన్ని అతి కష్టమ్మీద తీశారు. సమాచారం అందుకున్న సిఐ ప్రభాకర్, ఎస్‌ఐలు పాపారావు, సూర్యకుమారితోపాటు హైవే సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను బయటకు తీసి వాటిని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని విజయనగరం ఎఎస్‌పి పరిశీలించారు.

మూడు కుటుంబాల్లో విషాదఛాయలు

ఈ ప్రమాదంతో శ్రీకాకుళం పట్టణంలో మూడు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కౌశిక్ తండ్రి శ్రీకాకుళం పట్టణంలోని పేర్లవారి వీధిలో బంగారం దుకాణం నిర్వహిస్తుంటారు. ఇదే పట్టణానికి చెందిన ప్రముఖ నగల వ్యాపారి లంకా గాంధీ కుమార్తెతో ఏడాది క్రితమే ఆయనకు వివాహమైంది. తండ్రికి చేదోడువాదోడుగా కౌశిక్ ఉండేవాడు. వడ్డే అభినవ్ తండ్రి మన్మథరావుతో కలిసి పట్టణంలో లియో పేరుతో మెడికల్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కిందట మణిమాలతో వివాహం జరగగా, వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఆ కుటుంబంలో తీరని శోకం మిగిలింది. ఆ బాలుడు అనాథ అయ్యాడు. డ్రైవర్ జయేష్ తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి సున్నపువారి వీధిలో టీ దుకాణం నడుపుతోంది. ఇప్పుడు కుమారుడు కూడా చనిపోవడంతో తనను అనాథని చేసి వెళ్లిపోయావంటూ ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

అతివేగంతో అటు నుంచి ఇటు..

టొయాటో కంపెనీకి చెందిన ఫార్చునర్ కారులో వీరంతా శ్రీకాకుళం నుంచి బయలుదేరి వస్తున్నారు. ఏం జరిగిందో తెలియదు కాని పోలిపల్లి వంతెన పైనుంచి దిగిన తరువాత ఒక్కసారిగా అతివేగంతో దూసుకొచ్చింది. ఇంతలో టైరు పేలిపోవడంతో కారు ఏకంగా డివైడర్ పైనుంచి అవతల వైపు అనగా శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలోకి ప్రవేశించింది. పల్టీలు కొడుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. సమీపంలో ఉన్న పెట్రోల్ బంకులో ఉన్న సిసి కెమెరాల్లో ఈ దృశ్యాలు కనిపించాయి. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జయింది.



బొబ్బిలి.. తడిసిన వరిపనలను ఎండబెడుతున్న రైతులు



భోగాపురం.. హైవే పక్కన నారుపేట వద్ద నేలవాలిన వరి చేను

వర్షార్పణం

వర్షంతో రైతులకు అపార నష్టం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఫెంగల్ తుపాను ప్రభావంతో శుక్ర, శనివారాల్లో జిల్లాలో కురిసిన చిరుజల్లులు, వర్షాలతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా చిరుజల్లులతో వర్షం కురిసింది. వర్షాలకు పంట పొలాల్లో ఉన్న వరి పనలు తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు మొక్కజొన్న, పత్తి పంటలకు అపార నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిపోయిన వరి పనలను రైతులు ఆరబెడుతున్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.


భోగాపురం : ఫెంగల్ తుపాను ప్రభావంతో వీచిన గాలులకు భోగాపురం మండలంలో పలుచోట్ల వరి చేను పొలాల్లో నేల వాలింది. కోతకొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారుపేట, నందిగాం, ముంజేరు, భోగాపురం తదితర గ్రామాల్లో వరి పంట కోత దశలో ఉంది. ఇలాంటి సమయంలో వరిచేను ఇలా పడిపోవడంతో రైతులు కొంత ఆందోళనకు గురవుతున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో వేటకు వెళ్లరాదని మత్స్యకారులను అధికారులు హెచ్చరిస్తున్నారు.



బొబ్బిలి..టార్పాలిన్లు కప్పి ట్రాక్టర్‌పై ధాన్యం తరలిస్తున్న రైతులు

గురజాడ రచనలు సజీవం

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ



కవితా పోటీల్లో విజేతగా నిలిచిన ఉపాధ్యాయులు పద్మజకు పురస్కారాన్ని అందజేస్తున్న ఎన్‌వి రమణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు రచనలు ఎన్నేళ్లు గడిచినా సజీవంగా నిలుస్తాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ అన్నారు. స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన గురజాడ 109వ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. తొలుత ఆయనతోపాటు ప్రముఖ రచయిత మీగడ రామలింగస్వామి.. జ్యోతి ప్రజ్వలన చేసి, గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామలింగస్వామికి గురజాడ విశిష్ట పురస్కారాన్ని ఎన్‌వి రమణ, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎన్.వి.రమణ మాట్లాడుతూ విజయనగరం విశిష్టతను కొనియాడారు. ఆనాటి సమాజంలో ఉన్న రుగ్మతలపై గురజాడ రచనలు సాగించారని తెలిపారు. పురస్కార గ్రహీత రామలింగస్వామి మాట్లాడుతూ గురజాడ రచనల ద్వారా సమాజ రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేశారన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితా పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. గంట్యాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కె.పద్మజ రచించిన 'అమ్మ కంటే ముందు' అనే కవితకు పురస్కారం లభించింది. ఆమెకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ.2 వేలు నగదు బహుమతిని ఎన్‌వి రమణ, రామలింగస్వామి, నిర్వాహకులు అందజేశారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన గురజాడ అప్పారావు నివాసంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ వినియోగించిన వస్తువులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గురజాడ వారసులు వెంకట అప్పారావు, ఇందిరా, కుటుంబ సభ్యులు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ, గురజాడ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్, రోటరీ డాక్టర్ వెంకటేశ్వరరావు, సూర్యలక్ష్మి, సాహితీ వేత్తలు ఎ.గోపాలరావు, బిహెచ్ సూర్యలక్ష్మి, మానాప్రగడ ఎం.వి.ఆర్.కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశిష్ట పురస్కార గ్రహీత మీగడ రామలింగస్వామి, తదితరులు

పైడితల్లమ్మను ఎన్.వి.రమణ

విజయనగరం టౌన్ : సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ దంపతులు పైడితల్లమ్మ దేవాలయాన్ని సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి, కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, ఆర్‌డిఒ కీర్తి తదితరులు.. స్వాగతం పలికారు. ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్‌పి కలిశెట్టి ఆయనకు పివిజి రాజు ది లాస్ట్ మహారాజ్ ఆఫ్ విజయనగరం అనే పుస్తకాన్ని అందించారు. అనంతరం కొత్తవలస మండలం మంగళపాలెం వద్దనున్న గురుదేవ్ చారిటబుల్ ట్రస్టులో వికలాంగులకు ఎన్‌వి రమణ దంపతులు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు.

జెఎన్‌టియు రోడ్డు విస్తరణకు సహకరించండి



మాట్లాడుతున్న విఎంఆర్‌డిఏ ప్రణాళికా విభాగాధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు జంక్షన్ నుంచి కళాశాల వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణకు సహకరించాలని విఎంఆర్‌డిఎ ప్రణాళికా విభాగాధికారి కె.వెంకటేశ్వరరావు.. నిర్వాసితులను కోరారు. శనివారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వాసితులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ 37 మంది ఆస్తుల విషయంలో టిడిఆర్ రూపంలో నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారు. అనంతరం నిర్వాసితుల అభిప్రాయాలను సేకరించారు. సదస్సులో విఎంఆర్‌డిఎ ప్రణాళిక అధికారులు పి.నాయుడు, బి.నిర్మల, టౌన్ సర్వేయర్ సింహాచలం, మండల సర్వేయర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రూ.156.93 కోట్లతో నగర బడ్జెట్

స్టాండింగ్ కమిటీ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రూ.156.93 కోట్లతో విజయనగరం నగర బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. శనివారం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన నగరపాలక సంస్థ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. నగర అభివృద్ధి పనులకు రూ.72.45 కోట్లు కేటాయించారు. రూ.10 కోట్ల సాధారణ నిధులతో కొత్తగా రోడ్లు వేసేందుకు, బిఎస్‌పి నిధులు రూ.2.50 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. రూ.కోటితో సచివాలయాల పక్కా భవనాలు, రూ.కోటితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు, రూ.1.50 కోట్లతో హార్టికల్చర్, పట్టణ సుందరీకరణ, సాధారణ నిధులు రూ.5 కోట్లతో మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణం, రూ.కోటితో సెంట్రల్ లైటింగ్, పార్కుల లైటింగ్, జంక్షన్ లైటింగ్, రూ.1.50 కోట్లతో పార్కులు, ఆట స్థలాల అభివృద్ధికి కేటాయింపులు చేశారు. రూ.2.50 కోట్లతో నీటి సరఫరా కోసం లైన్లు విస్తరణ, ఎన్‌సిఎపి నిధులు రూ.2 కోట్లతో కాలుష్య నివారణ పనులకు, రూ.2 కోట్లతో నగర పాలక సంస్థ ఆస్తుల రక్షణకు ప్రహరీల నిర్మాణానికి కేటాయించారు. ఈ బడ్జెట్‌ని స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. కొన్ని ఆదాయాలు పెంచే మార్గాలపై దిశానిర్దేశం చేసింది. ప్రధానంగా నగర పాలక సంస్థ భూములు, ట్రేడ్ లైసెన్సులు పెంచడం, ప్రకటనల ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని కమిటీ సభ్యులు ఎస్‌విపి రాజేష్, బాబు, అల్లు చాణక్య, రేగాన రూపావతి సూచించారు. కమిటీ సభ్యులు చేసిన సూచనలు పరిగణనలోకి తీసుకుని తుది బడ్జెట్ రూపొందిస్తామని మేయర్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, అన్ని శాఖలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్‌కి ఇంజినీరింగ్ కార్మికుల వినతి

మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21 వేలు, టెక్నికల్ వేతనం రూ.26 వేలు అమలు చేయాలని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కమిషనర్ పి.నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎస్‌వి రాజేష్‌కి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు, స్థానిక నాయకులు రామునాయుడు, ఆదినారాయణ మాట్లాడుతూ వందలాదిమంది కార్మికులు థర్డ్ పార్టీ విధానంలో నలిగిపోతున్నారని, నెలల తరబడి కాంట్రాక్టరు జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జులైలో 54 మందిని ఆప్కాస్‌లో చేరుస్తూ కౌన్సిల్ తీర్మానించినా నేటికీ అమలుకు నోచుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో భాస్కర్ రావు, రామారావు, ధనుంజయ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇలాగేనా పత్తి రైతుల్ని ఆదుకొనేది?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ప్రభుత్వం గానీ, అధికారులు గానీ ఇలాగేనా పత్తి రైతుల్ని ఆదుకొనేది.? ప్రకటించిన ధరే కంటి తుడుపుగా ఉంది. దీనికితోడు ఈ ఏడాది మదుపు కూడా పెరిగింది. ప్రభుత్వం మద్దతుధరకు కొనుగోలు చేస్తేనే పెద్దగా లాభం వచ్చే పరిస్థితి లేదు. అలాంటిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసిన ఒక్కగానొక్క కేంద్రంలో కనీస మద్దతు ధర దొరకడం లేదు. దీనికితోడు ఇ-క్రాప్ నమోదు కాకపోవడం వల్ల ఏకంగా కొనుగోలు చేసేందుకే నిరాకరించడంతో దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది' ఇదీ ఉమ్మడి విజయనగరం జిల్లాలో పత్తి రైతుల ఆవేదన.

విజయనగరం జిల్లాలో 4,137 ఎకరాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 14,807 ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ ఏడాది వర్షాలు సహకరించడంతో దిగుబడి, నాణ్యత కూడా బాగానే ఉన్నాయి. క్వింటాకు ప్రభుత్వం మద్దతుధర రూ.7,521 ప్రకటించింది. ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతుధర అమలు చేస్తామని జెసి, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రగల్భాలు పలికారు. వారి మాటలు కోటలు దాటినా, ఆచరణ గడప కూడా దాటలేదు. పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, భామిని సహా పలు అవసరమైనన్ని చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇటు విజయనగరంలోనూ అదే పరిస్థితి. ఇక్కడి జెసి, మార్కెటింగ్ శాఖ ఎడి కూడా అటువంటి చిలకపలుకులే పలికారు. ప్రణాళికను ప్రజాప్రతినిధులు ఆకాశానికి ఎత్తేశారు. ఆచరణలో ఈ రెండు జిల్లాలకు కలిపి రామభద్రపురం మండలం ముచ్చర్లవలసలో ఒకే కేంద్రాన్ని ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అది కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందేమీ కాదు సుమా! అక్కడి ప్రతు జిన్నింగ్ మిల్లునే కొనుగోలు కేంద్రంగా చిత్రీకరించారు. దీంతో ఈ రెండు జిల్లాల్లోనూ శివారు ప్రాంతాల నుంచి పత్తి తీసుకెళ్లడం వ్యయ, ప్రయాసకు గురికావాల్సిన పరిస్థితి. తీరా తీసుకెళ్లాక నాణ్యత లోపించిందని, ఇ-క్రాప్‌లో నమోదు కాలేదని, నమోదైనప్పటికీ తెచ్చినదంతా తీసుకోవడం కుదరదని కుంటిసాకులు చెబుతున్నారు. ఇందుకు నిబంధనలు కూడా సాకుగా చూపుతున్నారు. కానీ, ఈ సాంకేతిక కారణాలన్నిటికీ బాధ్యులు ఎవరు? ఇ-క్రాప్ నమోదు చేయనందుకు రైతు సేవా కేంద్రాల అసిస్టెంట్లు బాధ్యులు కాదా? వారు చేస్తున్న పనిని ఎప్పటికప్పుడు తనిఖీ చేయనందుకు వ్యవసాయ శాఖ అధికారి బాధ్యులు కాదా? సీజన్ చివరి దశకు వచ్చినా, పత్రికలు కోడై కూస్తున్నా, రైతులు గగ్గోలు పెడున్నా మీనమేషాలు లెక్కిస్తున్న జాయింట్ కలెక్టర్ బాధ్యులు కాదా? అన్నది పబ్లిక్ టాక్. వీటికి సమాధానం చెప్పాల్సిన రైతు సేవా కేంద్రాల సిబ్బంది తమకు పనిభారం ఎక్కువైపోయిందని, నాలుగైదు రెవెన్యూ గ్రామాల పరిధిలో పనిచేయడం వల్ల కొన్ని తప్పులు దొర్లినమాట వాస్తవమేనని అంగీకరిస్తున్నారు. దొరికితే దొంగ, లేదంటే దొర అన్నట్టుగా తన పరిధిలోని అటువంటివేమీ జరగలేదని మరికొందరు బుకాయిస్తున్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారులైతే అబ్బే అటువంటిదేమీ లేదు, అరకొర తప్ప అంతా బాగానే జరిగిందని బుకాయిస్తున్నారు. జెసిలైతే నోరు మెదిపి రైతులను ఆదుకుంటామన్న మాట కూడా అనడం లేదు. ఇదే అదునుగా గ్రామాల్లోనూ, ప్రతు జిన్నింగ్ మిల్లు వద్ద మాటు వేసిన దళారులు రూ.6 వేల నుంచి రూ.6,300 లోపే కొనుగోలు చేస్తున్నారు. రైతుల బలహీనతను ఆసరాగా చేసుకుంటున్నారు. దీనిపై రైతులు, వారి సమస్యలపై పోరాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు మండిపడుతున్నారు.



మాదక ద్రవ్యాలను 'సంకల్పం'తో దూరం చేద్దాం

- హోంమంత్రి వంగలపూడి అనిత
- డ్రగ్స్ సమాచారాన్ని అందించేందుకు మిమ్స్ కళాశాలలో 'డ్రాప్ బాక్సులు' ఏర్పాటు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మాదక ద్రవ్యాల అలవాటును సంకల్పం కార్యక్రమంతో దూరం చేద్దామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను యువతకు వివరించి, వారిని చైతన్యపర్చి, మాదక ద్రవ్యాలపై పోరాటం చేసేందుకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాన్ని శనివారం మిమ్స్ వైద్య కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులే రేపటి భవిష్యత్తుకు మార్గ నిర్దేశకులని, అటువంటి విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, జీవితాలు నాశనం చేసుకోకూడదని అన్నారు. రాష్ట్రాన్ని మాదక ద్రవ్య రహితం చేయాలన్న ఉద్దేశ్యంతో డిజి స్థాయి పోలీసు అధికారి పర్యవేక్షణలో ప్రత్యేకంగా 'ఈగల్' పేరుతో పోలీసుశాఖ ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ప్రారంభించిందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు 1972 అన్న టోల్ ఫ్రీ నంబరును కూడా ఏర్పాటు చేసామన్నారు. ఎవరైనా ఈ నంబరుకు మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తే నగదు బహుమతులను కూడా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. రాష్ట్రంలో ఏ నేరం జరిగినా వాటి వెనుక దురదృష్టవశాత్తు డ్రగ్స్ ప్రభావం కనిపిస్తుందన్నారు. డ్రగ్స్ ప్రభావాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ మితిమీరి వినియోగిస్తే, మత్తు ప్రభావంతో విచక్షణ కోల్పోయి, నేరాలకు పాల్పడుతున్నారన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా డ్రగ్స్ ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ తమ విద్యాసంస్థలను నడిపేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయిని సమూలంగా నాశనం చేసేందుకు డ్రోన్స్ సహాయంతో గంజాయి పంటలను నాశనం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండ పల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు, ఎస్‌పి వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యే, ఎస్‌పి

మత్తుతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

ఆర్‌డిఒ జివి సత్యవాణి

ప్రజాశక్తి-చీపురుపల్లి

మత్తులో మునిగి యువత తమ జీవితాలను నాశనం చేసుకో వద్దని ఆర్‌డిఒ జివి సత్యవాణి అన్నారు. మాదక ద్రవ్యాలు, ఎయిడ్స్ నియంత్రణపై మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాధామాధవ ఫంక్షన్ హాలులో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్‌పి ఎస్ రాఘవులు, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఆర్.కుమార్, సిఐ శంకరరావులతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఏ లక్ష్యంతోనైతే కళాశాలలకు చదువుకునేందుకు పంపుతున్నారో ఆ లక్ష్య సాధన కోసం విద్యార్థులు ప్రయత్నం చేయాలన్నారు. డిఎస్‌పి రాఘవులు మాట్లాడుతూ డ్రగ్స్ వలలో ఒకసారి చిక్కుకుంటే అందులో నుంచి బయటకు రావడం చాలా కష్టమన్నారు. ప్రధానంగా యువత ఎక్కువగా ఈ డ్రగ్స్‌కి అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. వైద్యులు ఆర్.కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై యువతకు అవగాహన ఉండాలన్నారు. అంతకుముందు గాంధీ బొమ్మ జంక్షన్ నుంచి రాధామాధవ ఫంక్షన్ హాలు వరకు ఎయిడ్స్, డ్రగ్స్ నియంత్రణపై భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బివి గోవింద రాజులు, మీసాల లక్ష్మణరావు, డోల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కుంభకోణాన్ని బయట పెట్టాలి: సిపిఎం

బొబ్బిలి: విద్యుత్ కుంభకోణాన్ని బయట పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ అదానీ అవినీతిపై అమెరికాలో కేసు నమోదయితే అవినీతి జరిగిన ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కేసులు నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. వైసిపి హయాంలో రూ.2,029 కోట్లు ముడుపులు అందగా ప్రభుత్వ పెద్దలకు రూ.1,757 కోట్లు ముట్టినట్లు అమెరికాలో కేసు నమోదైందన్నారు. విద్యుత్ ముడుపుల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకి బ్రోకరేజం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. యూనిట్ విద్యుత్ రూ.1.99పైసలకు కొనుగోలు చేయాల్సి ఉండగా రూ. 2.49పైసలకు కొనుగోలు చేయడంతో రాష్ట్ర ప్రజలపై రూ.9,412 కోట్లు భారం పడుతుందని చెప్పారు. పాలకుల అవినీతితో ప్రతినెల విద్యుత్ చార్జీలు పెరిగి ప్రజలపై భారాలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కుంభకోణాన్ని టిడిపి ప్రభుత్వం బయట పెట్టాలని, విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసి విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిచో అన్ని పార్టీలు, సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు యుగంధర్, ప్రసాద్ ఉన్నారు.

క్రమశిక్షణతోనే మంచి భవిష్యత్తు: జడ్జి

వంగర: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీస్ అథారిటీ కమిటీ చైర్మన్ ఎ. విజయ్ రాజ్ కుమార్ అన్నారు. మండలంలోని యమ్.సీతారాంపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి తల్లిదండ్రులను, గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని చదువులో ఎలా ముందుకు సాగాలని అనే అంశంపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. అంతకుముందు యం. సీతారాంపురం బిసి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులు బాగోగులు గురించి వార్డెన్ సత్తిబాబుతో మాట్లాడి ఆరా తీశారు. విద్యార్థులకు దుప్పట్లు అందే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఐ షేక్ శంకర్, ఉపాధ్యాయులు పాలవలస శ్రీరాములునాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

సిపిపి రికవరీ నిలుపుదలపై హర్షం

బొబ్బిలి: పెన్షనర్ల నుంచి సిపిపి రికవరీ నిలుపుదలపై పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ పెన్షనర్ల నుంచి పిపిపి రికవరీ పూర్తి అయినప్పటికీ రికవరీ నిలుపుదల చేయకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. సిపిపి రికవరీ నిలుపుదల చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సిపిపి రికవరీ నిలుపుదల చేసిందన్నారు. సిపిపి రికవరీ నిలుపుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ట్రెజరీ అధికారులకు కృతజ్ఞతలు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్.జగన్నాథం, బొబ్బిలి యూనిట్ అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఆర్.కృష్ణమూర్తి, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్తుడు అదానీని అరెస్టు చేయాలి

మెంటాడ: అదానీ గ్రూపు సంస్థలు ఉత్పత్తి చేసే సౌర విద్యుత్‌ను దేశంలో వివిధ విద్యుత్ పంపిణీ సంస్థలకు కొనుగోలు చేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు భారీగా ముడుపులు చెల్లించిన అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. శనివారం మెంటాడలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ ముడుపులు వ్యవహారంలో అదానీ ఉన్నట్లు రుజువు కావడం, అప్పటి సిఎం జగన్‌కు రూ.1750 కోట్లు ముట్టజెప్పారని అభియోగం రావడంతో అదానీ అంతర్జాతీయ మోసగాడని రుజువైందన్నారు. ఈ కేసులో పొందుపరిచిన వ్యక్తులపై విచారణ జరిపి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొర్చ తాత, వడ్డి లక్ష్మి, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేపాడ: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతు పండించిన ధాన్యాన్ని ప్రతి ఒక్క రైతు నుంచి కొనుగోలు చేస్తామని అన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతు వద్ద నుంచి ధాన్యం తీసుకున్న 48 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము జమ చేస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రైతు నుంచి కొనుగోలు చేసిన దాన్యంలో ఏవైనా లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, ఎస్‌టి కమిటీ మెంబర్ దాసరి లక్ష్మి, టిడిపి నాయకులు కె.రమణమూర్తి, పోతల రమణ, గొంప తులసి, శానాపతి గణేష్, తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎఒ ఎ.యశ్వంత్‌కుమార్, గ్రామ సర్పంచులు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నందిగాంలో సివిల్స్ రైట్స్‌డే

తెర్లాం: మండలంలోని నందిగాంలో శనివారం తహశీల్దార్ హేమంత్‌కుమార్ సివిల్స్ రైట్స్‌డే నిర్వహించారు. కాలనీలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, మురికి నీరు వెళ్లిపోవడానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదని గ్రామస్తులు ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యాధుల బారిన పడకుండా తక్షణమే కాలువలు శానిటేషన్ చేయించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

స్పందించారు.. శుభ్రపరిచారు..

ప్రజాశక్తి కథనానికి స్పందన

శృంగవరపుకోట: ధర్మవరం మేజర్ పంచాయతీలోని కొత్త వీధిలో పేరుకుపోయిన చెత్త నుంచి దుర్గంధం వెలువడుతుండడంతో స్థానికుల సమాచారం మేరకు ఇలా ఉంటే రోగాలు రావా? అని శనివారం ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనానికి ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య, పంచాయతీ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ స్పందించారు. ఈ మేరకు హుటాహుటిన జెసిబిలను ఏర్పాటు చేసి చెత్తను తొలగించారు. కొత్త వీధి చివరలో దుర్గంధం వెదజల్లుతున్న విషయాన్ని ప్రజాశక్తిలో ప్రచురించినందుకు స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా పెన్షనర్ల 17వ వార్షికోత్సవం

కొత్తవలస: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం 17వ వార్షికోత్సవ వేడుకలు శనివారం మండల కేంద్రంలో అధ్యక్షులు కవురు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న పెన్షనర్ల సంఘం బిల్డింగ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి మండల అధ్యక్షులు గొర్లపల్లి రాము, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరు వెంకట రత్నాజీ, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, నక్కరాజు చిన రాము, కర్రీ సూర్య నూకరాజు, కోరుపోలు అప్పారావు, అప్పికొండ సీతారామరాజు, మండల కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి ఉమాలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయం, విద్యుత్, విద్యాశాఖ, ఉపాధి హామీ పథకంపై సమీక్షించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలో 14 మిల్లులు ఉన్నాయని ఏ ఒక్క రైతుకీ ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరిస్తామని తెలిపారు. ప్రతి ఒక్క రైతు పంటకు ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. ఇంతకుముందు వైసిపి ఉన్నప్పుడు ప్రభుత్వమే రైతుల పండించిన పంట మీద ఇన్స్యూరెన్స్ చేయించేదని ఈ ప్రభుత్వం రైతుల మీద భారం వేస్తోందని ఎంపిపి ఉమా లక్ష్మి అన్నారు. ఎపిఒ సుశీల మాట్లాడుతూ ఉపాధి హామీలో రైతులకు నుయ్యిలు, పొలాలకు గట్లు వేసే పనులకు అవకాశం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఆర్. రాంబాబు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, రమాదేవి పాల్గొన్నారు.

ముగిసిన పోలీసు స్పోర్ట్స్ మీట్

జిల్లా పోలీసు మైదానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. విజేతలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్ బహుమతులు ప్రదానం చేశారు.



\- ప్రజాశక్తి, విజయనగరం కోట

పల్లెపండగ పనుల అడ్డగింత

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడలో శనివారం జనసేన కార్యకర్తలు చేస్తున్న పల్లె పండగ పనులను టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. జనసేన కార్యకర్త వాసిపల్లి సురేష్ చేపట్టిన 200 మీటర్ల సిసి రోడ్డు పనులను ఆపేయాలంటూ టిడిపి కార్యకర్తలు పట్టుబట్టారు. కూటమి ధర్మం పాటించకుండా పనులు నిర్వహించడం ఏంటని టిడిపి ప్రశ్నించారు. శుక్రవారం పనులు ఆపేయాలని చెప్పినప్పటికీ మరల శనివారం కూడా కొనసాగించడం ఏంటని మండిపడ్డారు. దీనిపై కూటమి నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలు ఆదివారం పోలీస్ స్టేషను వచ్చి సమస్య పరిష్కరించేలా మాట్లాడు కోవాలని పోలీసులు తెలిపినట్లు సమాచారం. వెండర్ కోడ్ ఉంటుండగా టిడిపి వాళ్ళు పనిచేయనివ్వకుండా అడ్డుపడుతున్నారంటూ జనసేన కార్యకర్త సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపితో కుమ్మక్కై పనిచేయకుండా అడ్డుపడుతున్నారనీ ఆరోపించారు. పొత్తు ధర్మం పాటించకుండా పనులను నిర్వహిస్తే ఊరుకునేది లేదని టిడిపి నేతలు కూడా వాగ్వివాదం చేస్తున్నారు. కోనాడలో జరిగిన వాగ్వివాదం ఎమ్మెల్యే లోకం నాగ మాధవకి, టిడిపి పెద్దలకు తెలిసింది. దీనిపై పెద్దలు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.


జెసిబికి అడ్డంగా ద్విచక్ర వాహనాన్ని పెట్టిన టిడిపి నాయకుడు

లింగాలవలసలో పల్లె పండగ పనులు అడ్డగింత

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామంలో పల్లె పండగ పనులను టిడిపి నాయకులు శనివారం అడ్డుకున్నారు. జెసిబితో జనసేన నాయకులు పనులు నిర్వహిస్తుండగా గ్రామ సర్పంచ్ బుగత లలిత, టిడిపి నాయకులు బుగత రామ్మోహన్, ఓదూరి నర్సింహులు, బర్ల శీను పనులను నిలిపివేశారు. పంచాయతీలో టిడిపి సర్పంచ్ ఉన్నప్పటికీ వారికి పనులు కేటాయించకుండా జనసేనకు పనులు కేటాయించడంతోనే అడ్డుకున్నామని టిడిపి నాయకులు తెలిపారు.

తుపాను పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి- బొండపల్లి

తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమతంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి విటి. రామారావు సూచించారు. మండలంలోని గరుడబిల్లి గ్రామంలో శనివారం తహశీల్దార్ డి.రాజేశ్వర రావు, వ్యవసాయ అధికారి మల్లికార్జునరావుతో కలసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రామారావు మాట్లాడుతూ వచ్చే రెండు మూడు రోజులు భారీ వర్ష సూచన ఉన్నందున రైతులు కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. పంట నూర్పిడి పూర్తి అయిన చోట్ల ధాన్యానికి తగు జాగ్రత్తలు చేసి నిల్వ చేసుకోవాలని సూచించారు. రైతులు సిద్ధం చేసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించే విధంగా చూడాలని కొనుగోలు కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మామిడి అప్పలనాయుడు, ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నెల్లిమర్ల: తుపాను కారణంగా వరి పంట నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫెంగల్ తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులు కోసిన వరి పంటను నీట ముంచిందన్నారు. దీంతో రైతులు వర్షంలో తడిసిన వరి పంటను ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పంట చేతికందుతుందన్న సమయంలో తుపాను ప్రభావంతో అకాల వర్షాలు కురిసి రైతును నట్టేట ముంచాయని తెలిపారు. అధికార్లు పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతును వెంటనే ఆదుకొని నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనుల గుర్తింపుపై వాగ్వివాదం


బొబ్బిలి: పనులపై వాగ్వివాదం చేసుకుంటున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు గుర్తింపుపై టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవిందరావు మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదానికి పెట్టిన అభివృద్ధి పనులను ఏ ప్రాతిపదికన గుర్తించారని ప్రశ్నించారు. టిడిపి వార్డులకు ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. దీనిపై స్పందించిన టిడిపి కౌన్సిలర్ వైసిపి ప్రభుత్వం హయాంలో ఏకపక్షంగా వైసిపి వార్డులకు నిధులు కేటాయించారని, టిడిపి హయాంలో అన్ని వార్డులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పడంతో ఇరు పార్టీల కౌన్సిలర్లు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రాజా కళాశాల రోడ్డులో కాలువలు కట్టకుండా రోడ్లు వేయడంతో రోడ్లు పాడైపోతున్నాయని టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ అన్నారు. అత్యవసరం లేని పనులకు ముందస్తు అనుమతులు ఎందుకు తీసుకోవాల్సి వస్తుందని, అత్యవసర పనులకు మాత్రమే ముందస్తు అనుమతులు తీసుకోవాలని శరత్ కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ కరెంట్ ఆఫీసు నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు రోడ్డు పక్కన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవి మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు ఆక్రమణలను తొలగించాలని కోరారు. కాలువలపై నిర్మాణాలు చేయడంతో పాటు షాపులు పెట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గొల్లవీధి రోడ్డు ఆక్రమణకు గురైందని చెప్పారు. టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్కెట్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. మేదరబంద జంక్షన్ వద్ద ఉన్న నుయ్యిపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ షాపు అద్దె చెల్లించేందుకు మున్సిపల్ ఆఫీసుకు వస్తే ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మేదరబంద షాపుల యజమానులు రోడ్డును ఆక్రమిస్తున్నారని, తొలగించాలన్నారు. తమ వార్డు అభివద్ధికి నిధులు మంజూరు చేయడం లేదని 14వ వార్డు కౌన్సిలర్ ఎస్.లక్ష్మి అనగా నిధులు మంజూరు చేస్తామని చైర్మన్ మురళీకృష్ణ హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించాలని వైసిపి కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు కోరారు. పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిల్ సమావేశంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ మురళి, కమిషనర్ రామలక్ష్మి హామీ ఇచ్చారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


నెల్లిమర్ల: గొడవ పడుతున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

కౌన్సిలర్లంటే గౌరవం లేదా..?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో కౌన్సిలర్లంటే గౌరవం లేదా అని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. శనివారం స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు కాకుండా వేరే వారు ఉండడంతో అసలైన కౌన్సిల్ సభ్యులకు సీట్లు లేకుండా పోయాయి. దీంతో పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీను, చిక్కాల సుమతి, పైల భారతి మాట్లాడుతూ కౌన్సిలర్లు కాని వారు సమావేశానికి ఎలా అనుమతిస్తారని, అసలు కౌన్సిలర్లకు కనీసం సీటు కూడా ఏర్పాటు చేయక పోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార్లు కూడా ప్రజల చేత ఎన్నుకోబడ్డ కౌన్సిలర్లకు కనీసం సమాచారం ఇవ్వకుండా కుళాయి కనెక్షన్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. దీనిపై టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు అభ్యంతరం వ్యక్తం చేసి వైసిపీ పాలనలో ఇలానే ప్రశ్నించారా అని అడగడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదంతో చర్చ జరగకుండారాసాభాసగా మారింది.

క్రమశిక్షణకు నిదర్శనం భట్లు: జడ్జి

ప్రజాశక్తి- చీపురుపల్లి

క్రమశిక్షణ, అంకిత భావానికి నిదర్శనం ఎంబివి భట్లు అని జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత అన్నారు. చీపురుపల్లిలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్ ఎంబివి భట్లు పదవీ విరమణ కార్యక్రమానికి శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతీ ఉద్యోగి జీవితంలో వస్తుందని, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులకు సమయాన్ని కేటాయించడం ద్వారా వ్యక్తి గత జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలని సూచించారు. పదవీ విరమణ పొందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎంబివి భట్లు, తన సతీమణికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఘనంగా పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ పొందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎంబివి భట్లు మాట్లాడుతూ న్యాయ శాఖలో పనిచేస్తూ పదవీ విరమణ పొందడం ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగిల్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం అడిషనల్ సెషన్ జడ్జి ఎస్.దామోదర్‌రావు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గజపతినగరం

గడ్డి మందు తాగి మరుపల్లి గ్రామానికి చెందిన శీర పైడిరాజు(31) శనివారం మృతి చెందాడు. ఎస్ఐ కె.లక్ష్మణ రావు అందించిన వివరాల మేరకు.. శీర పైడిరాజు అదే గ్రామానికి చెందిన చబుకు రామలక్ష్మి అనే వివాహితతో సన్నిహితంగా ఉంటున్నాడు. అప్పటికే ఆమెకు భర్త ముగ్గురు పిల్లలు, మృతునికి భార్య ఉంది. అయితే వీరిద్దరూ శుక్రవారం పురిటిపెంట రైల్వే గేట్ వద్ద గడ్డి మందు తాగి స్పృహ కోల్పోయి ఉన్నారు. స్థానికులు చూసి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి జిల్లా కేంద్రాస్పత్రికి వైద్యనిమిత్తం తరలించారు. శనివారం ఉదయం అతను మరణించారు. రామలక్ష్మి చికిత్స పొందుతోంది. మృతుని తండ్రి శీర అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

లెండిలో జాతీయ స్థాయి శిక్షణ పారంభం

డెంకాడ: హైదరాబాదుకు చెందిన బ్రెయిన్విజన్ సొల్యూషన్స్, ఎపిసిటిఇ సహకారంతో లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జావా ఫుల్ స్టాక్, రియాక్ట్ జెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై నేషనల్ లెవల్ షార్ట్-టర్మ్ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి తెలిపారు. అకడమిక్ పరిజ్ఞానం, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో, పాల్గొనేవారికి అవసరమైన నైపుణ్యాలతో సాధికారత కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాల కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. హెడ్ సిఎస్ఇ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు, సమన్వయకర్త పిజెవిజి ప్రకాశరావు, పాల్గొన్నారు

క్రీడా దుస్తులు పంపిణీ

వంగర: మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన విద్యుత్తు శాఖ విశ్రాంతి ఉద్యోగి అదే గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను శనివారం ఉచితంగా అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జగదీశ్వరి, నాయకులు లచ్చుబుక్త కృష్ణమూర్తి, ఎఎంసి చైర్మన్ అన్నంనాయుడు, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గురజాడ స్ఫూర్తితో హింస వ్యతిరేక ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆధునిక మహిళ చరిత్ర తిరగరాస్తుందన్న గురజాడ స్ఫూర్తితో హింసకు వ్యతిరేకంగా ఉద్య మిద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపు నిచ్చారు. శనివారం గురజాడ అప్పారావు వర్ధంతిని స్థానిక ఎల్‌బిజి నగర్‌లో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకం ద్వారా మహిళల జీవితాలనే మార్చిన మహాకవి గురజాడ అని కొనియాడారు. ఈ హింస, వరకట్నం, మద్యం, తదితర మహిళా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పుణ్యవతి, రామలక్ష్మి, కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

గురజాడ అభ్యుదయ దార్శనికుడు

నగరంలోని జనసేన నేత గురాన అయ్యలు తన కార్యాలయంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఆదాడ మోహన్‌రావు, డోలా రాజేంద్ర ప్రసాద్, ఎంటి రాజేష్, మేడపిల్లి పవన్ కుమార్, పృథ్వీ భార్గవ్ పాల్గొన్నారు. జెఎన్‌టియు-జివిలో గురజాడ విగ్రహానికి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రాజేశ్వరరావు నివాళులర్పించారు

బొబ్బిలి: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సేవా స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. గురజాడ చిత్రపటానికి బాల సాహిత్య రచయిత ఎన్.వి.ఆర్ సత్యనారాయణమూర్తి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు లంక వాసుదేవరావు, సభ్యులు పాల్గొన్నారు.

మెంటాడ: స్థానిక హైస్కూల్ ఆవరణలో ప్రధానోపా ధ్యాయులు సిహెచ్ అరుణ కుమారి అధ్యక్షతన గురజాడ వర్ధంతి నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గండ్రేటి అప్పలనాయుడు మాట్లాడు తూ గురజాడ అప్పారావు సంఘం సంస్కర్త, మహాకవి, హేతువాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, విశ్రాంత ఉపాధ్యాయులు రెల్లి పైడిపు నాయుడు, ఉపాధ్యాయులు చంద్రకళ, అప్పలకొండ, పీడీ ఎం.శ్రీనివాసరావు, పి రామమూర్తి, ఎస్ సత్యనారాయణ, మండల వెంకట రమణ పాల్గొన్నారు.

రామభద్రపురం: తన రచనల ద్వారా ఆనాటి సమాజంలోని దూరాచారాలను ప్రజలకు అవగాహన కల్పించి వాటిని రూపుమాపేందుకు మహాకవి గురజాడ అప్పారావు చేసిన సేవలు శ్లాగ్ నీయమని నాయుడువలస పాఠశాల హెచ్ఎం, రోటరీ జిల్లా చైర్మన్ జె.సి రాజు అన్నారు. శనివారం పాఠశాలలో మహాకవి గురజాడ వర్ధంతిని తెలుగు ఉపాధ్యాయులు కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, కృష్ణంనాయుడు, సత్యం, వెంకట రమణ తదితరాలు పాల్గొన్నారు.

విజయనగరంకోట : గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూల్లో గురజాడ చిత్రపటానికి తెలుగు బాషా సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు, కరస్పాం డెంట్ ఎం.నారాయణరావు నివాళులర్పించారు. విద్యార్థులు గురజాడ వేషధారణలో ఆకట్టుకున్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన హోంమంత్రి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలోని 19వ వార్డులో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, టిడిపి నాయకులు కిమిడి నాగార్జున, సువ్వాడ రవి శేఖర్, కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని మల్లంపేటలో శనివారం బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఎరుకుల పాకలో ఎంపిటిసి పాలవలస గౌరు, సర్పంచ్ పార్వతి పింఛన్ పంపిణీ చేశారు.

తెర్లాం: మండలంలోని కుసుమూరు, నందబనగా గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే బేబినాయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ ఆర్ రాంబాబు, టిడిపి నాయకులు ఎన్ వెంకట్‌నాయుడు, వెంకటేశ్వరరావు, యుగంధర్, ఆర్.శంకర్ రావు పాల్గొన్నారు.

గుర్ల: మండలంలోని పెదబంటుపల్లి, రౌతుపేట, లవిడాం, తదితర గ్రామాలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక్ నాయుడు చేతులు మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసి నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు చనుమల మహేశ్, పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఇసుక వేలం

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ట్రాక్టర్లు, లారీలు ద్వారా తరలిస్తున్న ఇసుకను పట్టుకొని కేసులు నమోదు చేసిన పోలీసులు శనివారం ఆ ఇసుకను ఎస్ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం పిజెసిజె కోర్టు పబ్లిక్ ఆక్షన్ ఉత్తర్వుల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో తహశీల్దార్ పద్మావతి సమక్షంలో బహిరంగ వేలం వేసినట్లు తెలిపారు. పూసపాటిరేగ మండలం కొప్పెర్ల గ్రామానికి చెందిన సంకాబత్తుల సత్తిబాబు రూ.37,500కు వేలం పాట పాడుకున్నారని తెలిపారు. 67 కేసుల్లో 103.25 యూనిట్ల ఇసుకను వేలం వేశామన్నారు. వేలం పాటదారుడు ఈ నగదును ప్రభుత్వ ఖజానాకు చెల్లించి ఇసుకను తీసుకెళ్లవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో పినతాడివాడ విఆర్ఒ మహంతి రామచంద్ర రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.